నేడు మీకోసం రద్దు

లంక గ్రామాల్లో పాఠశాలలకు, అంగన్వాడీలకు సెలవు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కొనసాగుతున్న గోదావరి వరద కారణంగా సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ 'మీకోసం' రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలో జరగాల్సిన మీకోసం కార్యక్రమాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి ప్రాంతంలో వరద తాకిడికిగురైన మండలాల్లోని లంక గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీలకు కూడా సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

మళ్లీ గోదావరి ఉగ్రరూపం

ఇళ్ల చుట్టూ వరద నీరు - నీటిలోనే పంట పొలాలు - లంకగ్రామాల ప్రజలు, రైతుల ఆందోళన

మర్రిమూలలో వరద నీటిలో నుంచి నడిచి బయటికి వస్తున్న వృద్ధుడు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గత రెండు రోజుల క్రితం తగినట్లే తగ్గిన గోదావరి మళ్లీ ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరుతుండడంతో రెండు రోజుల నుంచి మళ్లీ గోదావరి పరవళ్లు తొక్కుతోంది. వశిష్ట గోదావరి కోడేరు రేవులో ఆదివారం సాయంత్రానికి మూడు అడుగుల మేర నీటిమట్టం పెరిగి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. మండలంలోని పుచ్చల్లంక, నక్కిడి లంకరాయి లంకలు ముంపు బారిన పడ్డాయి. అయోధ్యలంక పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరుతోంది. నెమ్మదిగా గ్రామంలోని ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుతోంది. అయోధ్య లంక ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవేశిస్తోంది. దీంతో పుచ్చలంక వాసులు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకవాసులకు రాకపోకలు నిలిచిపోవడంతో నిత్యావసర సరుకులకు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి సైతం వారికి అవస్థలు తప్పడం లేదు. అయోధ్యలంక గ్రామంలో పలు ఇళ్ల వరద నీరు చుట్టుముట్టింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, తహాశీల్దార్ ఐపి శెట్టి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, వివిధ శాఖల అధికారులు ముంపునకు గురైన లంక గ్రామాల్లో పరిశీలించారు. ఏటిగట్టు దిగువన గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న భీమలాపురం శివారు కాపులపాలెం జలదిగ్బంధంలో చిక్కుకుంది. పలు నివాసాల చుట్టూ వరద నీరు చేరింది. లంక గ్రామాలకు బోటు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు.

నీట మునిగిన పంటలు..

లంక గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ప్రధానంగా తమలపాకు పండించిన రైతులకు తీవ్ర నష్టం తప్పడం లేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. పచ్చిమిర్చి, అరటి ఇతర కూరగాయ తోటలు కూడా నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. రైతుల సురక్షిత ప్రాంతాలకు పశువులను తరలిస్తున్నారు.

యలమంచిలి : ఎగువ ప్రాంతాల నుంచి ఉరకలెత్తుతూ వడివడిగా వస్తున్న వరద నీటితో గంటగంటకూ అధికమవుతున్న గోదావరి వరద మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. ఈ ప్రభావంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెద్దలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, వడ్డిలంక, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్లపల్లి పాలెం తదితర గ్రామాల్లోని పంట పొలాలు, ఇళ్ల వద్దకు భారీగా వరద నీరు చేరుకుంటోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కనకాయలంక గ్రామంలో కాజ్‌వేపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వరద ప్రభావంతో కనకాయలంక, పెదలంక, అభిరాజుపాలెంలోని తమలపాకు తోటలు, అరటి తోటలు నేలను నేలనంటడంతో వరదలో పడిపోయిన అరటి గెలలను రైతులు పడవలపై గట్లకు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి.

యలమంచిలి : పడవపై ప్రయాణిస్తున్న గ్రామస్తులు

కనకాయలంక గ్రామస్తులను పరామర్శించేందుకు పడవపై వెళ్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అధైర్య పడొద్దు.. సాయం అందిస్తాం

వరద బాధితులకు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా

ప్రజాశక్తి - యలమంచిలి

వరద బాధిత ప్రాంతాల ప్రజలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ సాయం ప్రతి గడపకూ అందించే బాధ్యత తమదేనని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతమైన కనకాయలంక గ్రామ ప్రజలను పడవపై వెళ్లి పరామర్శించడంతోపాటు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ మంచి నూనె, కేజీ ఉల్లిపాయలు, కేజీ కందిపప్పు, కేజీ బంగాళదుంపలు వంటి నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అనేక పర్యాయాలు వరదలు సంభవించినా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హెలీక్యాప్టర్లో తిరిగి గాలిలోనే ప్రజలను పరామర్శించి ప్రజలకు ఎటువంటి సాయం అందించిన పరిస్థితి లేదన్నారు.

పశువులను రక్షించి మానవత్వం చాటుకున్న మంత్రి నిమ్మల

కనకాయలంక గ్రామ పరిధిలోని మర్రిలంకలో వరదలో చిక్కుకున్న రైతులకు చెందిన సుమారు 150 పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అప్పటికప్పుడు మంత్రి నిమ్మల నాలుగు మరపడవలను ఏర్పాటు చేసి ఫైర్ సిబ్బంది రైతులతో కలిసి దగ్గరుంచి వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చేతకాకపోతే సెలవు పెట్టి వెళ్లండి

తహశీల్దార్‌పై మంత్రి నిమ్మల ఆగ్రహం

సకాలంలో వరద బాధిత గ్రామ ప్రజలకు సేవలందించడం చేతకాకపోతే సెలవు పెట్టి వెళ్లాలని యలమంచిలి తహశీల్దార్ సిహెచ్ విజయశ్రీపై రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం కనకాయలంక గ్రామాన్ని మంత్రి రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు భోజన వసతి కల్పించకపోవడంతో పాటు స్థానికంగా ప్రజలను చేరవేస్తున్న పడవల యజమానులకు సొమ్ములు చెల్లించకపోవడం వంటి సమస్యలు మంత్రి దృష్టికి రావడంతో ఒక్కసారిగా ఆగ్రహంతో తహశీల్దార్ ఫైర్ అయ్యారు. అనంతరం ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు.

చంద్రన్న బీమా.. ఉన్నట్టా లేనట్టా..!

ప్రభుత్వం మార్పుతో వైఎస్ఆర్ బీమాగా పేరుమార్పు

ఇప్పటికీ విధి విధానాలు ఖరారు కాని పరిస్థితి

సహజ మరణానికి రూ.ఐదులక్షలు, ప్రమాదం జరిగితే రూ.పది లక్షలు అంటూ కూటమి మ్యానిఫెస్టో

జూన్ 30 తర్వాత మరణించిన వారిపేర్లు ఆన్‌లైన్‌లో నమోదు నిల్

రెండు జిల్లాల వ్యాప్తంగా జులైలో పదుల సంఖ్యలో ఇంటిపెద్దను కోల్పోయిన కుటుంబాలు

గ్రామ సచివాలయాలకు వెళ్లి నిరాశగా వెనక్కి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం మారడంతో వైఎస్ఆర్ బీమా స్థానంలో చంద్రన్న బీమా అమలు కానున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ దానికి సంబంధించిన విధి విధానాలు ఏమీ రూపొందించలేదు. దీంతో

జులైలో మరణించిన వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో చంద్రన్న బీమా ఉన్నట్టా.. లేనట్టా అంటూ జనం చర్చించుకుంటున్న పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. ఇంటి పెద్ద మృతి చెందితే రూ.రెండు లక్షలు వరకూ ఇచ్చేవారు. దీంతో నిరుపేద కుటుంబాలకు ఇది ఎంతగానో ఆర్థికంగా ఉపయోగపడేది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకానికి వైఎస్ఆర్ బీమా అంటూ పేరు మార్చింది. ఆర్థిక సాయం రూ.లక్షకు మాత్రమే పరిమితం చేసింది. దీనిపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్ఆర్ బీమా పేరును చంద్రన్న బీమాగా మార్పు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించలేదు. కుటుంబ పెద్ద మృతి చెందితే మాత్రమే ఇస్తారా.. కుటుంబంలో ఎవరు చనిపోయినా బీమా సాయం అందిస్తారా అనేది తేలలేదు. దీంతో అంతటా అయోమయం నెలకొంది. జూన్ 30వ తేదీ తర్వాత మృతిచెందిన వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. ప్రభుత్వం విధి విధానాలు విడుదల చేయకపోవడంతో సైట్‌ను ఆపేశారు. దీంతో జులైలో మృతి చెందిన వారి పేర్లు ఇప్పటి వరకూ ఆన్‌లైన్ కాలేదు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు గ్రామ, పట్టణ సచివాలయాలకు వెళ్లి నిరాశతో వెనుదిరిగి వస్తున్నారు. ఇంకా ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదని.. ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించాక చెబుతామంటూ సచివాలయ ఉద్యోగులు చెబుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో బీమా సాయం అందుతుందా లేదా అన్న ఆందోళన బాధిత కుటుంబాల్లో నెలకొంది. గత లెక్కలు ప్రకారం పరిశీలిస్తే ప్రతినెలా ఒక్కో జిల్లాలో 20 నుంచి 30 వరకూ బీమా క్లయిమ్స్ నమోదైన పరిస్థితి కనిపిస్తోంది. జులై నెలలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చాలా కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి వారంతా సచివాయాలకు వెళ్లి నిరాశగా వెనక్కి వస్తున్నారు. ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి విడుదల చేసిన మ్యానిఫెస్టోలో చంద్రన్న బీమా కింద సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.పది లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ చంద్రన్న బీమా విధి విధానాలు ఖరారు కాలేదు. దీంతో బీమా సాయం వస్తుందా లేదా అన్న అనుమానాలు బాధితుల్లో నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులు టిడిపి, జనసేన నాయకులను కలిసి తమను ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు. నాయకులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే చంద్రన్న బీమా విధి విధానాలను విడుదల చేసి బాధిత కుటుంబాలకు బీమా సాయం అందించాలని అంతా కోరుతున్నారు.

ఘోరం..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కుమారులు మృతి

తల్లికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.. ఎంతో భవిష్యత్తు ఉన్న ముగ్గురి నిండు జీవితాలను చిదిమేసింది.. కష్టపడి పనిచేసి ఆర్థికంగా స్థిరపడాలన్న వారి ఆశ అడియాశగానే మిగిలింది.. పనికి వెళ్లి తిరిగి వస్తున్న ఆ కుటుంబాన్ని యాక్సిడెంట్ రూపంలో మృత్యువు కబళించింది. దీంతో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన భీమవరంలో అందరినీ కలిచివేసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం పట్టణంలోని గునుపూడి ప్రాంతంలోని ఇంద్ర కాలనీలో నివాసం ఉంటున్న మంగళం కోటయ్య, దుర్గ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కోటయ్య స్థానికంగా పొలం పనులకు వెళ్తుంటాడు. దుర్గ తన ముగ్గురు కొడుకులతో రోడ్లు, డ్రెయినేజీ, పైప్‌లైన్ వంటి పనులకు వెళ్తుంటారు. దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నర్సీపట్నం పనికి వెళ్లి తిరిగి సొంత ఊరైన భీమవరం రావడానికి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ద్విచక్ర వాహనంపై నలుగురు బయలుదేరారు. మార్గమధ్యంలో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి శివారుకు వచ్చే సరికి బండి అదుపు తప్పడంతో వారు పడిపోయారు. ఈ క్రమంలో వెనకనుంచి వచ్చిన వాహనం వారిపై నుంచి వెళ్లడంతో ఏసు (18), రాజు (17), అఖిల్ (11) అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి దుర్గకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డివైఇఒకు యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భీమవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ రావుకు యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆదివారం వినతిపత్రం అందజేసింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశామని యుటిఎఫ్ నేతలు వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయ రామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కెఎస్‌సిహెచ్.సాయిరామ్, సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, వివిధ మండలాల, పట్టణ శాఖల నాయకులు ఉన్నారు.

డివైఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..

లంక వాసులు కలెక్టర్‌కు వినతి

ఆచంట: గోదావరికి వరదలు సంభవించి వారం రోజులు కావస్తున్నా నేటి వరకూ అధికారులు మంచినీళ్లు కూడా అందించలేదని ఆచంట మండలం అయోధ్యలంక గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నాగరాణి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కలెక్టర్ వరద తాకిడికి గురైన అయోధ్యలంక మర్రిముల లంక గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గోదావరి వరదలు సంభవించడం వల్ల గ్రామంలోని తాగునీటి జలాలు పూర్తిగా కలుషితం అయ్యాయని, దీంతో తాగునీటికి అవస్థలు పడుతున్నామని విన్నవించుకున్నారు. అయితే అధికారులు ఇంతవరకు ఒక మంచినీటి ప్యాకెట్ కూడా అందించలేదని కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో తక్షణమే ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే లంక గ్రామాలకు వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆమె వరద ముంపులోనే కాలినడకన, ట్రాక్టర్ పైన, ద్విచక్ర వాహనం పైన, పడవలలోనూ పర్యటించి గ్రామస్తుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది గ్రామస్తులతోపాటు విద్యార్థులు తమ గ్రామానికి వంతెన లేకపోవడంతో పడవలపై బయటకు వెళ్లి రావాల్సి వస్తుందని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు సందర్శించి మందుల వివరాలను పరిశీలించి, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పలువురు గ్రామస్తులు ఉపాధి హామీ కూలీ పనులు చేసి రోజులు గడుస్తున్న ఇంతవరకు సొమ్ములు జమ కాలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



అయోధ్య లంకలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

వరద బాధితులను అన్ని విధాల ఆదుకుంటాం..

రాష్ట్రస్థాయిలో పరిష్కారం కావాల్సిన వాటికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. వరద ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, నూనె, కందిపప్పు వస్తువులను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పశుగ్రాసానికి కొరత లేకుండా అవసరమైన చర్యలను తీసుకోవడం జరిగిందని, పశు గ్రాసాన్ని కూడా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ ఐపిశెట్టి, ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, ఫణి కుమార్ పాల్గొన్నారు.

ముంపు నష్టంపై పరిశీలన

రైతాంగానికి పలు సూచనలు జారీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత రెండురోజులుగా ఉభయగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్న మంత్రుల పర్యటనలో ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పివి.సత్యనారాయణ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొని ఉభయగోదావరి జిల్లాల్లోని ముంపు నష్టం, తదుపరి కార్యాచరణ గురించి వివరించారు. ఈ సందర్భంగా తణుకు నగరపాలక కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని వివరించినట్టు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మొత్తం వరి విస్తీర్ణం 2.39 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు 1.08 లక్షల ఎకరాలలో నాట్లు పూర్తయ్యాయని, మిగిలిన విస్తీర్ణంలో నాట్లు వేయవలసి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన ప్రాథమిక అంచనా ప్రకారం పశ్చిమగోదావరి జిల్లాలో 1422 ఎకరాలలో నారుమడి, 15,301 ఎకరాలలో ప్రాధానపొలం దెబ్బతిన్నట్టుగా తెలిపారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, తణుకు చుట్టుపక్కల గ్రామాలలో పంట 25-40 రోజుల వయసు ఉండగా ఎర్రకాలువ ముంపు వల్ల చాలాచోట్ల పంట దెబ్బతిన్నట్టుగా తెలిపారు. పంట 7 రోజులకుపైగా నీట మునగడం, రైతు సోదరులు ఎరువుల కోటా పూర్తిచేసిన తరుణంలో పంట కుళ్లిపోయే అవకాశం చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1010, ఎంటియు 1156, ఎంటియు 1153, ఎంటియు 1293 లేదా పిఆర్ 126 లాంటి రకాలను వేసుకోవడం వల్ల పంటకాలం నష్టపోకుండా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రెండు, మూడు రోజులు ముంపుకు గురై నీరు లాగేసే పొలాల్లో చేను త్వరగా నిలదొక్కుకోవడానికి 20 కిలోల పొటాష్, 15 కిలోల యూరియాను నీరు లాగేసిన తరువాత చేనుకు వేయాలని సూచించారు. దీంతో పాటుగా కార్బెండిజం ం మాంకోజెబ్ కలిసిన మిశ్రమ మందు 2.0 గ్రాములు లేదా కార్బెండిజం 1.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే తెగుళ్లు రాకుండా నివారించవచ్చన్నారు. ముంపుకు గురైన రైతాంగం పైన తెలియజేసిన సూచనలతో కొంత వరకూ నష్టాన్ని పూడ్చుకోవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా మురుగు కాలువలు, పంట కాలువల్లో పూడికతీత, గండ్లు పడిన చోట మరమత్తులు చేయవలసిన అవసరం ఎంతైన ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక పూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక పూర్తి అయినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయక కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 27న మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరవాసరంలో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర, బాలికల బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎంపికలకు జిల్లాలో వివిధ ప్రాంతముల నుంచి 30 మంది బాలికలు, 40 మంది బాలురు పాల్గొన్నారని మల్లేశ్వరరావు తెలియజేశారు. ఎంపికైన జట్లు మహిళలు బి.సౌమ్యశ్రీ(తనుకు), సిహెచ్.మానస(మాముడురు), ఎం.మరియ (పిఎం.లంక), ఎస్.గౌరి(శ్రీ వాసవి కాలేజ్, తాడేపల్లిగూడెం), గులిపల్లి స్వాతి(వీరవాసరం), కె.రాజశ్రీ (శ్రీ వాసవి కాలేజ్, తాడేపల్లిగూడెం), స్టాండ్ బైగా ఎ.అంజలీ దేవి(భీమవరం), జి.ఉమా దేవి(నర్సాపురం), పురుషులు ఎస్.సాగర్(మండపాక), డి.విల్సన్(గునుపూడి), పి.అనోజ్(గునుపూడి), ఎ.ఆనంద్(భీమవరం), పి.ఫణి(వీరవాసరం), ఎం.దుర్గారావు(ఉండి) ఎంపికైన ఇరు జట్లు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, ఇందుకూరి పేటలో ఆగస్టు 2, 3, 4వ తేదీల్లో జరగనున్న 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపికలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాజింకి శ్రీనివాస రావు, మహమ్మద్ ఖుద్దుస్, కె.కృష్ణారెడ్డి, బి.జాన్సన్, బాజింకి గంగా మహేష్‌లు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు

రైల్వే గూడ్స్ కార్మికులకు భద్రత కల్పించాలి

ఆకివీడు: రైల్వే గూడ్స్ కార్మికులు ఉద్యోగ భద్రతకు గుర్తింపు కార్డుల కోసం ఉద్యమించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వి.వీరాస్వామి పిలుపునిచ్చారు. రైల్వేగూడ్స్ ఫ్లాట్‌ఫారం వద్ద గూడ్స్ ముఠా వర్కర్ల సమావేశం ఆదివారం సాయంత్రం ముఠా నాయకుడు నిమ్మల శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వీరాస్వామి పాల్గొని మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా కార్మికులు ఎగుమతులు, దిగుమతులు నిర్వహించడం తప్ప ఏ ఇతర బెనిఫిట్స్ లేవన్నారు. కనీస వేతనం గాని పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటీ గుర్తింపు కార్డులు వంటివి ఏమీ అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల స్పందించి సమైక్యతతో హక్కులు సాధించాలని పిలుపునిచ్చారు. ఈనెల 29న డిఆర్ఎం కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు, వేల్పూరి త్రిమూర్తులు, పీతల శ్యాంబాబు, ఆదోని ప్రసాద్, చేగొండి సత్యనారాయణ, నిమ్మల రాంబాబు, నాయుడు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న వీరాస్వామి

పొన్నపల్లి ఏటిగట్టు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం పొన్నపల్లి ఏటిగట్టు వద్ద గోదావరి వరద ఉధృతిని అధికారులతో కలిసి ఆదివారం నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. అనంతరం నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావుని వరద ఉధృతిపై ఆరా తీశారు. పొన్నపల్లిలో అధికారులతో కలిసి ఎంఎల్ఎ పర్యటించారు .

వర్తకుల సేవలు అభినందనీయం : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన సభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాలు తన గెలుపు కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. వాణిజ్య రంగానికి, వ్యాపార రంగానికి పాలకొల్లుకు పెట్టింది పేరన్నారు. మంచి పౌరులుగా బాధ్యత గల వ్యక్తులుగా వ్యాపార రంగాల్లో మంచి పేరు తెచ్చుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభం అవుతున్న అన్నా క్యాంటీన్లకు చాంబర్స్ అఫ్ కామర్స్ లక్ష రూపాయలు చెక్కును మంత్రికి అందజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడును ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు ఘనంగా సన్మానించారు.

ప్రకృతి పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రకృతిని పరిరక్షించడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహం వార్డెన్ భానుమణి, శ్యామల అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గునుపూడిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. వార్డెన్ భానుమణి, శ్యామల మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడానికి నడుం బిగించాలని, విచ్చలవిడిగా సాగుతున్న విధ్వంసం ఫలితంగా జీవ, వృక్షజాలం మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ అడవులు, జంతువుల పరిరక్షణ కోసం ప్రజలను భాగస్వామ్యం చేయాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని, ప్రకృతిని నాశనం చేస్తున్నారని, ఈ చర్యలను ఇంతటితో ఆపకపోతే సకల ప్రాణికోటి జీవరాశుల మనుగడకే కష్టతరం అవుతుందన్నారు. అనంతరం వసతిగృహంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి గ్రామంలో ఈనెల 29న ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కొప్పర్రు పశువైద్యాధికారి డాక్టర్ ఇంజేటి సురేంద్ర తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8.30 నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరంలో గర్భకోశ వ్యాధులకు చికిత్స, లేగ దూడలకు నట్టల నివారణ, గొర్రెల చికిత్స, గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు, కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మురుగు కాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న నాయకర్

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు గ్రామంలో మురుగు కాలువలో గుర్రపు డెక్క పూడికతీత పనులను నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. పనులు చురుగ్గా చేపట్టాలని గుత్తేదారుకు, అధికారులకు ఎంఎల్ఎ సూచించారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, ఆకన చంద్రశేఖర్, వాతాది కనకరాజు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రజలకు రహదారుల నిర్మాణం ప్రారంభించినట్లు సర్పంచి కాశాని విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామంలో గత నుంచి 11 రోడ్లు వల్లపై నీరు నిల్వ ఉండడం వల్ల రోడ్లు మెరక చేయమని కోరగా పంచాయతీ వారు సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో 11 రోడ్లు వేయుటకు పాలకవర్గ సభ్యులు తీర్మానం చేయుట జరిగిందని, దీంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారని తెలిపారు. గతంలో స్మశాన వాటిక సుమారు 60 సెంట్లు వరకు ఆక్రమణకు గురైందని, దానిని కూడా ఇప్పుడు పంచాయతీ వారు స్వాధీనం చేసుకుని 60 సెంట్లలో చెత్త గుట్టలను వేసి చుట్టూ సరిహద్దుల్లో బోర్డు పెట్టామని తెలిపారు. ఈ పనులన్నీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరుగుతున్నందుకు గ్రామ ప్రజలందరూ అభినందిస్తున్నారని చెప్పారు.

మానవత కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి - ఉండి

సేవ చేయటానికి మానవత ఉండి మండల శాఖ ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసినట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణం రాజు, గాదిరాజు రంగరాజు తెలిపారు. ఆదివారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి మండల శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు శాఖ అధ్యక్షులు పెన్మెత్స రామకృష్ణం రాజు అధ్యక్షత వహించారు. రామకృష్ణరాజు, రంగరాజు మాట్లాడుతూ ఈ ఏడాది నూతన కార్యవర్గం సేవ చేయటానికి ఒక ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్రీజర్స్ ఏర్పాటు చేయటం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయటం, విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ఇప్పించటం, విద్యార్థులకు విద్యా సామాగ్రి, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తమ విద్యార్థికి చదువు నిమిత్తం ఆర్థిక చేయూత ఇవ్వటం, పౌష్టికాహారం అందజేయటం, నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందజేయటం, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయటం, శాంతి ర్యాలీ నిర్వహించటం తదితర సేవలు అందించటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సభ్యత్వం నమోదు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. కలిదిండి నారాయణ రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ దంగేటి రామలింగేశ్వరరావు, కోశాధికారి కట్రెడ్డి నాగ తాండవ సత్య నారాయణ, ఆంజనేయులు, రాయి రాములమ్మ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట

రహదారుల నిర్మాణమే ఈ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంట పంచాయతీ పరిధి మానేవారిపాలెం నుంచి వంగ తాళ్లచెరువు వెళ్లే పంచాయతీరాజ్‌కు చెందిన రహదారికి ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. రహదారిని రూ.కోటి 8 లక్షలతో నిర్మించనున్నారు. 1.5 కిలోమీటర్ల దూరం ఉండే ఈ రహదారిని 3.75 మీటర్ల మేర వెడల్పుతో రహదారిని విస్తరించి నిర్మాణం చేయనున్నారు. సుదీర్ఘకాలం తర్వాత రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం పట్ల వంగతాళ్ల చెరువు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వంగతాళ్ల చెరువు వాసులు స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఎంఎల్ఎ పితాని దృష్టికి తీసుకువచ్చారు. రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ రమాకాంత్, డిఇఇ జి.వెంకట రత్నం, ఎఇఇ మెహర్ బాబా, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

'పార్టీలో ప్రాధాన్యతివ్వాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఆదివారం ఆ పార్టీ మొగల్తూరు గ్రామ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ వైస్ ఎంపిపి అంద్రాజు రామన్న, అయితం చందు, కవురు రంగా, బంధన నాగార్జున మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పార్టీలో అందరిని కలుపుకు వెళ్లడం లేదని వారు ఆరోపించారు. పార్టీలో సరైన నాయకుడు లేకపోవడంతోనే చీలికలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమర్థవంతమైన నాయకుడికి నరసాపురం ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో చంపాటి సత్యనారాయణ రాజు, దంపనబోయిన సత్యనారాయణ, ఇనుకొండ కాశి ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో దూకిన వ్యక్తి సురక్షితం

నరసాపురం: గోదావరిలోకి దూకిన వ్యక్తిని ఫైర్‌మెన్, మత్స్యకారుల సహాయంతో కాపాడిన సంఘటన నరసాపురంలో చోటుచేసుకుంది. నరసాపురం టౌన్ సిఐ అప్పల స్వామి కథనం ప్రకారం పొన్నపల్లికి చెందిన కోలా కృష్ణ(35) ఇంట్లో అలిగి ఆదివారం సాయంత్రం గోదావరిలో దూకి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అది చూసిన ఫైర్‌మెన్ బాల విజయ్ భాస్కర్, పోలీసులు, జాలర్లు సహాయంతో రెండు పడవలపై వెళ్లి గోదావరిలో దూకిన కృష్ణను కాపాడారు. అనంతరం కృష్ణను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బస్సు సెల్టర్‌కు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు

విద్యుత్ శాఖ అధికారుల అడ్డగోలు పనులు
చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సామాన్యులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే సవాలక్ష నిబంధనలు చెప్పే విద్యుత్ శాఖ అధికారులు తమవారికి మాత్రం అడ్డగోలుగా విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నారు. 'వడ్డించేవాడు మనవాడైతే చివరి బంతిలో కూర్చున్నా పరవాలేదు' అన్న తీరుగా ఉంది సంబంధిత అధికారుల తీరు. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయలు జీతం తీసుకుంటూనే నిబంధనలకు విరుద్ధమైన పనులు చేస్తూ అడ్డగోలుగా దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రమైన భీమవరం విద్యుత్ శాఖలో వెలుగులోకి వస్తున్న అనేక అంశాలు విస్తుగలుగుతున్నాయి.

స్థానిక విద్యుత్ శాఖ పరిధిలో ప్రతీ పనికీ ఎంతకంత ముట్ట చెప్పాలని, అలా అయితే ఎటువంటి నిబంధనలూ ఉండవని, లేకపోతే అన్ని నిబంధనలు వర్తించబడతాయని అధికారులు పదేపదే తిప్పుకుంటారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అలాంటిది కాసులు ఇస్తే మాత్రం ఎటువంటి నిబంధనలు లేకుండానే, కనీసం డోర్ నెంబర్ కూడా లేకుండా విద్యుత్ మీటర్లు ఇస్తారని, ఇలాంటివి భీమవరంలో కోకొల్లలుగా ఉన్నాయని తెలుస్తుంది.

బస్సు షెల్టర్‌కు బిగించిన విద్యుత్ మీటర్లు

స్థానిక వీరమ్మ పార్కు దగ్గర ఉన్న బస్సు షెల్టర్‌కి ఎటువంటి డోర్ నెంబర్ లేదు. ఈ సెల్‌కు ఎటువంటి విద్యుత్తు కనెక్షన్లు కూడా లేవు, అయినా కొందరు వ్యక్తులకు అనాధికారంగా ఇక్కడ విద్యుత్ అధికారులు కనెక్షన్ ఇవ్వడంపై స్థానికులు మండిపడుతున్నారు. కొందరు వ్యక్తులు అనధికార విద్యుత్ కనెక్షన్లు పెట్టి వ్యాపారం చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనధికార విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంలో విద్యుత్ అధికారులకు ముడుపులందుతాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అభివృద్ధి కన్సల్ ద్వారా పక్కనే ఉన్న బండ్లకు, చిరు వ్యాపారులకు అందించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ విద్యుత్ కనెక్షన్లు చూసిన ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. మన ఇంటికి విద్యుత్ కలెక్షన్ ఇవ్వాలంటే అధికారులు ఆ పత్రాలు తీసుకురా, ఈ పత్రాలు తీసుకురా, ఇంటి డాక్యుమెంట్లు జిరాక్స్‌తో పాటు వ్యక్తిగత ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రాలు కూడా ఇవ్వాలని, అప్పుడే వచ్చి పరిశీలించిన తర్వాత విద్యుత్ కనెక్షన్ అందిస్తామని అధికారులు చెప్తారని, కానీ ఎటువంటి ఆధారం లేకుండా ఈ బస్ షెల్టర్‌కు ఎందుకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాల్సి ఉండగా వారు పట్టించుకోకపోవడం వల్ల ఇటువంటి అక్రమ కనెక్షన్లు ఇస్తున్నారని, దీంతో రేపు సామాన్య ప్రజలు నిలదీస్తే వారు ఏమి సమాధానం చెప్తారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనెక్షన్ ఇచ్చిన ఎఇ, లైన్మెన్‌లతో పాటు ఆ వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మెంటేవారి తోటలోని 2వ వార్డులో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో 25 మంది గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం, 250 మంది ముంపు బాధితులకు ఆహార పొట్లాలను ఆదివారం అందించారు. మాజీ కౌన్సిలర్ ఎద్దు ఏసుపాదం మాట్లాడుతూ గత 10 రోజులుగా ఈ ప్రాంతాల్లో ముంపుకు గురైన బాధితులకు అనేక మంది దాతలు వివిధ రకాలుగా సహకరిస్తున్నారని, భోజనాలు, దుప్పట్లు, పిల్లలకు పుస్తకాలు, విద్యా సామాగ్రి అందిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్యాటరింగ్ వాసు(ఎస్ఆర్‌కెఆర్), చంద్రిక మూర్తి ఆర్థిక సహకారంతో 250 మందికి భోజనాలు అందించామని, మా తల్లి మహాలక్ష్మమ్మ పేరిట 25 మంది గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, బెన్ని పాల్గొన్నారు.

కొత్త కనక రత్నమాలకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆంధ్రప్రదేశ్ స్టేట్ నార్త్ సీనియర్ సిటిజన్ అధ్యక్షురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు కొత్త కనకరత్నమాలకు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని హొసూరుకు చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీలో ఆమె గత 45 సంవత్సరాలుగా వివిధ రంగాలలో అందిస్తున్న సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. శనివారం హొసూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ సర్టిఫికెట్‌తో పాటు మెమెంటో, మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ అకాడమీ ఫౌండర్ బి.బాబు విజయన్, తమిళనాడు మాజీ ఎంఎల్ఎ కెఎ.మనోకరన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ జె.హరిదాస్, డాక్టర్ ఎస్.జ్ఞానశేఖర్, డాక్టర్ కుమార్ గురు, డాక్టర్ శ్రీధర్ ఆదర్శ కళా నిలయం అధ్యక్షుడు డాక్టర్ చేరాల ప్రకాష్, డాక్టర్ ఎస్.రవిచంద్రన్, స్వామీజీ పాల్గొన్నారు.

మనం సేవా పురస్కారాలకు శ్రీనివాస్ రెడ్డి, సాకరాజు ఎంపిక

పెనుమంట్ర : కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ ప్రకటించిన సేవా పురస్కారాలకు మండలంలోని నెగ్గిపూడికి చెందిన మథర్ థెరిస్సా సేవా సంస్థకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, సాకరాజులు ఎంపిక అయ్యారు. ఈమేరకు ఆ సంస్థ ఫౌండర్, ఛైర్మన్ కె.చక్రవర్తి ఒక ప్రకటనలో అవార్డు ఎంపిక గురించి తెలిపారు. వచ్చే ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని వివిధ రంగాలలో పలు సేవలు అందిస్తున్నటువంటి సమాజ సేవకులకు గౌరవప్రదమైన అవార్డులను ప్రకటిస్తూ నెగ్గిపూడికి చెందిన మథర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్, అధ్యక్షులు కర్రి మురళీ శ్రీనివాసరెడ్డికి విశ్వమాత మదర్ థెరిస్సా జీవన సాఫల్య పురస్కారం, వ్యవస్థాపకులు డాక్టర్ సాకరాజుకి ఇంటర్నేషనల్ మనం బుక్ ఆఫ్ రికార్డ్ పురస్కారంకి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ అవార్డులకు శ్రీనివాస్ రెడ్డి, రాజు ఎంపిక కావడం పట్ల స్థానిక సేవా సంస్థల ప్రతినిధులు తమ హర్షం వ్యక్తం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

కాళ్ల: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, పిల్లలు వాటిని ఉపయోగించుకుని మంచి పౌరులుగా ఎదగాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లబోయిన శ్రీనివాస్ అన్నారు. లక్ష్మీనరసింహపురం గ్రామంలో మెండి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత వీరవల్లి రమేష్ ఆర్థిక సాయంతో విద్యాసామగ్రిని ఆదివారం అందజేశారు. వీరవల్లి రమేష్ తల్లిదండ్రులు కీర్తిశేషులు వీరవల్లి భాస్కర రావు(బాబీ), వీరలక్ష్మి జ్ఞాపకార్థంగా పాఠశాలలోని బాలబాలికలకు నోట్‌బుక్స్, కాపీపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు మొదలైన విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచి వీరవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు జుత్తుగ శ్రీనివాస్, యిర్రింకి బుజ్జి, మాజీ ఎంపిటిసి.గుడాల శివన్నారాయణ, హెచ్ఎం పవన్ కుమార్, పిసి ఛైర్మన్ రుద్ర వాసు పాల పాల్గొన్నారు.

రంగనాయకులకు సతీవియోగం

యలమంచిలి: సిపిఎం మండల కమిటీ సభ్యులు, కట్టుపాలెం గ్రామానికి చెందిన అంబటి రంగనాయకుల భార్య అంబటి లక్ష్మి (48) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. లక్ష్మి ప్రస్తుతం సిపిఎం తరపున కట్టుపాలెం పంచాయతీ వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. గతంలో రంగనాయకులు కూడా సిపిఎం తరపున పంచాయతీ వార్డు మెంబర్‌గా సుదీర్ఘకాలం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి మండలంలోని ఒక ప్రముఖ సిపిఎం నాయకుడిగా కొనసాగుతున్నారు.



లక్ష్మి(ఫైల్‌ఫొటో)

ఉపకారాగారం సందర్శన

నరసాపురం: నరసాపురం ఉపకారాగారాన్ని నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి సందర్శించారు. జైళులో ఉన్న ముద్దాయిల కేసులను పరిశీలించి జైల్ అదాలత్ నిర్వహించారు. రాజీపడ్డ తగిన కేసులలో ఉన్న ముద్దాయిలు వారిపై ఉన్న కేసులు రాజీ చేసుకోవడం వల్ల త్వరగా కేసు నుంచి విముక్తి పొందవచ్చునన్నారు. వారిపై కేసు పెట్టిన ఫిర్యాదునితో వారి కుటుంబ సభ్యులు, న్యాయవాదుల ద్వారా సంప్రదించి కేసులను రాజీచేసుకొనే దిశగా ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, జైల్ విజిటింగ్ న్యాయవాది శిరీష పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏలూరుపాడుకు చెందిన లయన్స్ క్లబ్ సభ్యులు, వాసవీ క్లబ్, భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. లయన్స్, వాసవీక్లబ్ సభ్యులు పలువురు ప్రముఖులకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ శిబిరంలో 150 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఆపరేషన్‌లు అతి తక్కువ ఖర్చుతో చేసి సరసమైన ధరలకు కళ్లజోళ్లు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవి వర్మ, డాక్టర్ పి.కృష్ణచైతన్య, ఆకివీడు లయన్స్ క్లబ్ సభ్యులు సన్నిధి వెంకన్న బాబు, గొంట్ల కృష్ణమూర్తి, నేరెళ్ల రామ చెంచయ్య పాల్గొన్నారు.

ఏలూరుపాడులో పలువురికి కి జ్ఞాపిక ను అందజేసి సత్కరిస్తున్న

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు సాయం

ముఖ్య అతిథులను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్థానిక మండల శాఖ ఆధ్వర్యంలో నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు సహాయం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కోణాల సూర్యనారాయణ రెడ్డిని(చిన్నరెడ్డి) సంస్థ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా పోడూరు గ్రామ విద్యార్థిని మాన్యం భూలక్ష్మికి నర్సింగ్ కోర్స్ పూర్తి చేయుటకు హైదరాబాద్‌కు చెందిన మేరీ సుజ్ఞానం సౌజన్యంతో సహాయం అందించారు. కవిటం గ్రామ విద్యార్థిని బోరబత్తుల నాగసాయిలక్ష్మి ఎంపిహెచ్‌డబ్ల్యూ కోర్స్ అభ్యసించడానికి అయ్యే ఖర్చు జిల్లా కార్యవర్గసభ్యులు, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణమూర్తి, ఇతర కమిటీ సభ్యుల సహకారంతో ఆర్థిక సహాయం అందించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, సెక్రటరీ చదువుల వెంకట నరేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు కొత్త సత్యనారాయణ మూర్తి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పెనుమంట్ర మండల ఛైర్మన్ కడలి సుబ్రమణ్యం, గౌరవ అధ్యక్షులు పడాల జగన్నాథ రెడ్డి, డాక్టర్ పోడూరి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు చిర్ల వంశీ హరినాథ్ రెడ్డి, యోగ మాస్టర్ రామచంద్ర రెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, డి.జయ దుర్గారావు, ఎస్.విశ్వనాథం, ఆచంట సుబ్బారావు, గుబ్బల శ్రీనివాస్, ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

పాలకొల్లు: సహకార సంఘాలు, రూరల్ బ్యాంకులు మరింత బలోపేతం చేసి రైతన్నలకు మరింత తోడుగా ఉంటామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెటు యార్డులో జిల్లా సహకార సంఘాలు, రూరల్ బ్యాంకు ఉద్యోగుల యూనియన్ మహాజన సభకు ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. జగన్ గత 5 సంవత్సరాల కాలంలో సహకార సంఘాలు, రూరల్ బ్యాంకులను నిర్వీర్యం చేశారని మంత్రి విమర్శించారు. తాను కో ఆపరేటివ్ శాఖ అధ్యక్షులుగా పని చేశానని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహకార సంఘాలు, రూరల్ బ్యాంకులు అంటే తనకు చాలా గౌరవమని, అన్నదాతలకు సహకారం చేసేది సహకార సంఘాలని, మంచి సహకారాలు అందిస్తే రైతులు చిరునవ్వులతో పంటలు పండించి మనకు అందిస్తారన్నారు. అటువంటి సహకార సంఘాలలో పనిచేసే ఉద్యోగులు మంచి పే స్కేల్స్, ఉద్యోగ భద్రత కల్పిస్తేనే రైతులకు మంచి సేవలు అందుతాయన్నారు. ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తే వారికి చాలి చాలని జీతాలతో, ఉద్యోగ భద్రత లేక రైతులకు మంచి సేవలు అందించలేమని, వ్యవసాయ రంగానికి పెద్దలోటు చేసిన వారతామని అన్నారు. ఉద్యోగులకు డిసిసిబి, అప్కాబ్‌లు నుంచి జీతాలు చెల్లించాలని గత టిడిపి ప్రభుత్వంలో ఆదేశాలు జారీ చేశానన్నారు. మంత్రికి ఉద్యోగులు మెమోరాండం అందజేశారు. ఉద్యోగులు మంత్రిని ఘనంగా సన్మానించారు.

ఇంటర్‌తో ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్‌తో ఉద్యోగ అవకాశాలను జిల్లాలోని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగులుగా సాఫ్ట్‌వేర్ కంపెనీలో కొలువు చేస్తూ ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన(మ్యాథ్స్ మినహా) మిగతా గ్రూపులకు ఇంటర్మీడియట్ బోర్డ్, హెచ్‌సిఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు తెలిపారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో బైపిసి, సిఇసి, హెచ్ఇసి, వృత్తివిద్య కోర్సులు చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఈ ఉద్యోగాల కోసం జిల్లాలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన సుమారు 300 మంది విద్యార్థులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ కావడం జరిగిందన్నారు. వీరికి ఇంటర్మీడియట్ బోర్డు హెచ్‌సిఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వాసవి జూనియర్ కళాశాల, (ఎల్ఐసి ఆఫీసు దగ్గర) తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలో భాగంగా తొలుత క్యాట్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, చివరగా ఇంగ్లీష్ పర్సంట్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. వీటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యర్థులకు ఏడాది శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో నాలుగో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఏడాది పాటు శిక్షణ పూర్తి కాగానే హెచ్‌సిఎల్ టెక్నో కంపెనీలోకి ఫుల్ టైం ఎంప్లాయ్‌గా తీసుకుని, ఏడాదికి మొదలు జీతంగా రూ.1.7 లక్ష ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వీరు డిపిఇ(అసోసియేట్ రోల్) విభాగంలో కూడా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. దీనికి అమిటీ, శాస్త్ర, కెఎల్ యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు. దీనిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు కింద విద్యార్థులకు హెచ్‌సిఎల్ కంపెనీ ఏటా రూ.15 వేలు అందజేయటం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9642973350 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి

ప్రజాశక్తి - తణుకు

ఆంధ్రా బిర్లా డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 103వ జయంతి సందర్భంగా తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వినీలాకాశంలో ధృవతారగా, ఆంధ్రా బిర్లాగా సుప్రసిద్ధులైన డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ కష్టే ఫలి, కష్టపడనిదే ఫలితం లేదు, కష్ట పడడాన్ని ఇష్టపడాలి అని భావించే వ్యక్తి అని కొనియాడారు. న్యాయబద్ధమైన కీర్తి, కాంక్ష లేని కృషి ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందని వారి నమ్మకం అని అన్నారు. తణుకు లాంటి మారుమూల గ్రామంలో ది.ఆంధ్ర షుగర్స్ లాంటి మహా సామ్రాజ్యాన్ని నిర్మించి తణుకును ప్రపంచ పటంలో ఒక గుర్తింపు తెచ్చి సాంప్రదాయాలకు, సంస్కారాలకు, మర్యాదలకు, మన్ననలిచ్చే మహత్తర కృషి వెలువడలేనిది అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కలగర హరిచంద్ర రావు, తణుకు పట్టణ టిడిపి అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకటరత్నం పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య నిర్మూలనా పనులు

ప్రజాశక్తి - గణపవరం

వర్షాల వల్ల ఎస్.కొండేపాడు గ్రామంలో మురికినీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా పారిశుధ్య నిర్మూలనా కార్యక్రమం చేపట్టినట్లు గ్రామ సర్పంచి సీతాళం వీరవరలక్ష్మి భర్త పుల్లయ్యనాయుడు ఆదివారం తెలిపారు. గ్రామంలో మురికి నీరు నిల్వ లేకుండా మురికి కాలవల్లో షీల్డుని తొలగించి కాలవలు శుభ్రం చేసినట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో దోమల మందు, బ్లీచింగ్ చిమ్మించినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరికైనా జ్వరం, జలుబు ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలని కోరారు.

డాక్టర్ గోగులమండ సుగుణ రావు మృతికి సంతాపం

నరసాపురం: గుడ్విల్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగులమండ సుగుణ రావు శనివారం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉండటంతో భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పశువులను ఎత్తైన ప్రదేశాలకు తరలించాలి

ఆచంట: లంక గ్రామాలకు వరద పెరుగుతున్న నేపథ్యంలో లంక రైతులు తమ తమ పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మండల పశు వైద్యాధికారి ఎల్.ఫణి కుమార్ తెలిపారు. లంక గ్రామాలైన ఆచంట మండలం పెదమల్లం పంచాయతీ పరిధి పెదమల్లం లంక, అనగార్లంక, కోడేరు పల్లిపాలెం, అయోధ్య లంకలో పశువులకు ఆయా గ్రామాల పశువైద్యాధికారులు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. దొమ్మ, ముద్ద శర్మ వ్యాధి తదితర రకాల వ్యాధులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. పశువులకు సమృద్ధిగా మేత పెట్టాలని రైతులకు సూచించారు.

పెరుగుతున్న సిద్ధాంతం కేదార్ ఘాటు నీటిమట్టం

పెనుగొండ: వశిష్ట గోదావరి అంతకంతకూ పెరుగుతున్నందున, ఎగువన కురిసిన భారీ వర్షాలకు వశిష్ట గోదావరి నీరు వరద ఉగ్రరూపం దాల్చడంతో ఎప్పటికప్పుడు సిద్ధాంతం కేదార్ ఘాటు నీటిమట్టం పెరుగుతుందని తహశీల్దార్ రోహిణి దేవి, సిబ్బంది పరిశీలించారు. ఆదివారం తహశీల్దార్ మాట్లాడుతూ లంకలు ముంపుకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికే పశుగ్రాసం కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిద్ధాంతం సర్పంచి చింతపల్లి గినరాజు, విఆర్ఒ బాలాజీ, పోలీసులు పహారా కాస్తున్నారని తెలిపారు.

ముత్యాలమ్మ సన్నిధిలో మాజీ మంత్రి కొత్తపల్లి

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలి

మొగల్తూరు: వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలని రోమన్ కాథలిక్ చర్చి ఫాదర్ బర్తలోమియో అన్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పులో ఉన్న చర్చి ఆవరణలో వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలోని పలువురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. వారికి దుప్పట్లు, పళ్లను అందించారు. ఆయా కార్యక్రమాల్లో సెయింట్ ఫ్రాన్సిస్ కాన్వెంట్ సిస్టర్స్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కలకల్లాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయాన్నే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

కార్యకర్తలకు అండగా జనసేన : నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని తూర్పుతాళ్లు, కొప్పర్రు గ్రామాల్లో ఆదివారం జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. పట్టణంలోని చినమామిడి పల్లి, పార్క్ రోడ్డులో సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ జనసైనికులు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వంతో భరోసా కల్పిస్తున్నారన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి జనసేన అండగా ఉంటుందన్నారు.